క్లుప్తంగా

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

తాడికొండ: నేడు అమరావతి ఫీడర్‌లోని మోతడక సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 6 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ ఏఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఈ అసౌకర్యం కలగనుందని చెప్పారు. నిడుముక్కల మోతడక, బేజాత్పురం, ముక్కామల, లచ్చన్నగుడిపూడి, రావెల, పాములపాడు గ్రామాలు, ట్రిపుల్ ఎక్స్ సబ్బుల పరిశ్రమ, కళాజ్యోతిలకు పైన పేర్కొన్న నిర్ణీత వేళల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని వెల్లడించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కంతేరులో రూ.55 వేల నగదు స్వాధీనం

తాడికొండ: తాడికొండ మండలం కంతేరు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళుతున్న రూ.55 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. వివరాల ప్రకారం గన్నవరం గ్రామానికి చెందిన చిర్రా వెంకటప్పారెడ్డి రూ.55 వేలతో తాడికొండ నుంచి గన్నవరం గ్రామానికి వెళుతుండగా కంతేరులోని డెక్కన్ కంపెనీ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలలో భాగంగా నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎలాంటి రసీదులు చూపించకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

కంప్యూటర్ శిక్షణ తరగతులు ప్రారంభం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కొలనుకొండ జాతీయ రహదారిలో సాయిబాబా గుడి పక్కన ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో గురువారం కంప్యూటర్ శిక్షణా తరగతులను ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 45 రోజుల పాటు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. శిక్షణా తరగతుల్లో ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, ట్యాలీ వంటి కోర్సులను నామమాత్రపు ఫీజు రూ.600తో విద్యార్థినీ విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని అనుకునేవారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9490099201, 9866466306 నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

వలంటీర్ల రాజీనామా



ఫిరంగిపురం: మండలంలోని గుండాలపాడు గ్రామానికి చెందిన 9మంది వలంటీర్లు గురువారం రాజీనామాలు చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి లక్ష్మీశారదకు అందజేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో కార్యాలయానికి అందజేయనున్నట్లు లక్ష్మీశారద తెలిపారు.

నకిలీ టికెట్లు అమ్మే వ్యక్తి అరెస్ట్

లక్ష్మీపురం: రైల్వే స్టేషన్‌లో నకిలీ రిజర్వేషన్ టికెట్లను చేయించే వ్యక్తిని జీఆర్పీ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలానికి చెందిన ఒ.విజయ్ కుమార్ రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ల వద్ద రిజర్వేషన్ చేయిస్తానని ప్రయాణికులను మోసగిస్తుంటాడు. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేశారు. సీఐ మాట్లాడుతూ ప్రయాణికులు రిజర్వేషన్ కౌంటర్ వద్ద ఇలాంటి వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు.

అనుమతి లేని టీడీపీ ప్రచార ఆటోపై కేసు

గుంటూరు ఈస్ట్: టీడీపీ నాయకులు అనుమతి లేని ఆటో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండటంపై కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. ఆటో డ్రైవర్ వెంకట్రావు తన ఆటో టీడీపీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని అనుమతి లేకుండా ప్రచారం చేస్తున్నాడు. పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే డివిజన్ గ్రూప్-డి ఉద్యోగులకు ఘన సత్కారం

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో సజావుగా పని చేయడంలో అమూల్యమైన అద్భుతమైన సేవలను అందించినందుకు గ్రూప్ డి ఉద్యోగులు అభినందనీయులని డివిజన్ మహిళా సంక్షేమం అధ్యక్షురాలు ఎం.ఆశాలత అన్నారు. స్థానిక గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం కార్యాలయ ప్రాంగణంలో గురువారం డివిజన్ పరిధిలోని మే డేను పురస్కరించుకుని గ్రూప్ డి ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ భారతీయ రైల్వేలు సజావుగా సాగేందుకు తెరవెనుక పని చేసే గ్రూప్ డి ఉద్యోగులే నిజమైన హీరోలని అన్నారు. రైల్వేల ప్రతిష్టను నిర్మించడంలో గ్రూప్ డి సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. సిబ్బంది చేస్తున్న మంచి పనిని గుర్తించి వారి మనోధైర్యాన్ని పెంచడం మా బాధ్యత అని చెప్పారు. అనంతరం పలువురు డివిజన్ గ్రూప్ డి ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డివిజన్ మహిళా సంఘం కార్యదర్శి ఎన్.వి.సాయి అఖిల, పి.షర్మిల, సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్ పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదల భవిష్యత్తుకు భరోసా

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్య
- ఇందిరా నగర్, మెల్లెంపూడి, ఇప్పటంలలో జోరుగా ఎన్నికల ప్రచారం
- హారతులు పట్టి స్వాగతం పలికిన మహిళలు



మంగళగిరి ఇందిరానగర్ ప్రచారంలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న మురుగుడు లావణ్య



ఇప్పటంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మురుగుడు లావణ్య, కిలారి వెంకట రోశయ్య కుమార్తె నివ్య

ప్రచార పర్వం

మంగళగిరి: గడచిన ఐదేళ్లలో ఒక పక్క సంక్షేమాన్ని, మరోపక్క అభివృద్ధిని అందించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన ఘనత సీఎం జగనన్నదేనని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్య అన్నారు. గురువారం నగరంలోని ఇందిరానగర్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఆమెకు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. మురుగుడు లావణ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీలకు అతీతంగా పారదర్శకంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నారు. గత ఎన్నికల్లో పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా చేసి చూపించామన్నారు.
అవినీతికి తావులేకుండా సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలన్నారు. జగనన్న ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించిందన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్సార్ సీపీ నాయకులు మురుగుడు సత్యంతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మెల్లెంపూడిలో విస్తృత ప్రచారం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మెల్లెంపూడిలో గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని పార్టీ మెల్లెంపూడి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో మంగళగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య కుమార్తె నివ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పాల్గొని పార్టీ ఎన్నికల గుర్తు ఫ్యానుపై అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజార్టీని గెలిపించాలని అభ్యర్థించారు. ముందుగా వీరి రాకను పురస్కరించుకుని మెల్లెంపూడి పార్టీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి రాజారెడ్డి, దొంతిరెడ్డి వెంకట శివరామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఈదుల మూడి శేఖర్, మైనార్టీ సెల్ నాయకులు జలీల్ ఆమెకు భారీ గజమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య గెలుపు కోసం స్థానిక దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మసీదు, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మెల్లంపూడి పురవీధుల్లో ప్రచారం నిర్వహిస్తూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మురుగుడు లావణ్య మాట్లాడుతూ మెల్లెంపూడిలో ఎన్నో సంవత్సరాల నుంచి పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించామన్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి చొరవ చూపించి మెల్లెంపూడి దేవాలయ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పక్కా రిజిస్ట్రేషన్‌లు చేయించి శాశ్వత భూహక్కులు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. రెండు కోట్ల రూపాయలతో డొంకరోడ్ల నిర్మాణం పూర్తి చేశారని అన్నారు. మంగళగిరి రూరల్ నూతక్కి నుంచి పంట పొలాల మీదుగా బకింగ్ హామ్ కెనాల్ వరకు బీటీ రోడ్, మెల్లెంపూడి నుంచి గుండిమెడ వరకు బీటీ రోడ్, గ్రామంలో పలు సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.3 కోట్లు ఖర్చుచేశామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారని, మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటే రాష్ట్రంలో వున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం వస్తుందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, పఠాన్ అలంబాడ్, పఠాన్ షేర్‌ఖాన్, దొంతిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కంచర్ల జయరావు, శ్రీనివాసరెడ్డి, సర్దార్, దొంతిరెడ్డి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

విమర్శలను పట్టించుకోం..అభివృద్ధిపైనే దృష్టి

తాడేపల్లిరూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యం ఇతర పార్టీలను విమర్శించడం కాదని గెలిచిన తరువాత రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజలకు సేవ చేయడమేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో అదేవిధంగా పరిపాలన చేశారని మంగళగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య అన్నారు. గురువారం రాత్రి ఇప్పటంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన గెలుపుతో పాటు గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య గెలుపు కోసం ఆయన కుమార్తె నివ్యతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, స్థానిక నాయకులు లచ్చి తులసి దాస్, హరిబాబు గౌడ్ ప్రచారంలో వీరిని అనుసరించారు. మొదటగా గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు మురుగుడు లావణ్యకు ఘన స్వాగతం పలికారు. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధాన రహదారుల్లో రోడ్‌షో నిర్వహించారు. ఫ్యాను గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆమె ఓటర్లను కోరారు. మురుగుడు లావణ్య మాట్లాడుతూ ఇప్పటంలో రూ.13 కోట్ల రూపాయలతో ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి అభివృద్ధి కార్యాక్రమాలు చేశారని, అప్పట్లో ఈ అభివృద్ధిని తట్టుకోలేక ఎంతోమంది దుష్ప్రచారాలు చేశారన్నారు. అభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణలో ఒక్క నివాసం కూడా తొలగించలేదన్నారు. కొంతమంది పని గట్టుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు లచ్చి వెంకటేశ్వరరావు, ప్రవీణ్, గోపి గౌడ్, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మారెడ్డి, వీరంకి హరిబాబు గౌడ్, వాకా గోపి గౌడ్, వీరంకి ప్రవీణ్ గౌడ్, లక్కాకుల రమేష్, గాజుల తిరుమలరావు, రంగారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందపాటిని కలిసిన ఎమ్మెల్యే అభ్యర్థి సుచరిత



మందపాటిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న సుచరిత, పలువురు నాయకులు

తాడికొండ: గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షుడుగా నియమితులైన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు, ఎమ్మెల్యే సుచరితలు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయానికి విచ్చేసిన మందపాటిని మేకతోటి సుచరిత, దయాసాగర్ దంపతులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డిలు ఘనంగా సత్కరించారు. వారి వెంట రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు శృంగారపాటి సందీప్, బుర్రా వెంకట శివారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి దానం వినోద్, మండల కన్వీనర్ బొర్రా వెంకటేశ్వరరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వయోవృద్ధులకు ఇంటి వద్దకే పింఛన్



ఫిరంగిపురం: ప్రతినెల ఒకటో తేదీన వృద్ధులు, వికలాంగులకు వలంటీర్లు ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేసేవారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ నెల బ్యాంకు అకౌంట్ ఉన్నవారికి బుధవారం వారి అకౌంట్లలో ప్రభుత్వం పింఛను నగదు జమ చేసింది. వయోవృద్ధులు, వికలాంగులు, బ్యాంకు అకౌంటు లేనివారికి పంచాయతీ సిబ్బంది గురువారం వారి ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను నగదు అందజేశారు. ఇలాంటి వారు 2,579 మంది ఉండగా ఇప్పటి వరకు 1941 మందికి ఇంటి వద్దకు వెళ్లి పింఛను అందజేసినట్లు అధికారులు తెలిపారు.

పేదల పింఛన్ అడ్డుకున్న దుర్మార్గుడు చంద్రబాబు

తుళ్లూరు బీసీ కాలనీ, టిడ్కో గృహాలలో వైఎస్సార్ సీపీ నాయకుల ఎన్నికల ప్రచారం



తుళ్లూరు బీసీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

తాడికొండ: పేదవాడికి ఒకటో తేదీన ఇంటి వద్దనే ఇచ్చే పింఛన్ కూడా అందకుండా అడ్డుకుంటూ వలంటీర్‌లపై ఫిర్యాదు చేసి అడ్డుకున్న బాబు దుర్మార్గ రాజకీయాలకు ఈ ఎన్నికల్లో చరమగీతం తప్పదని పలువురు ప్రజలు తమ అభిప్రాయం తెలిపారు. తుళ్లూరు గ్రామంలోని బీసీ కాలనీ, టిడ్కో గృహాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభించింది. ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించిన నాయకులకు ఆ ప్రాంత ఓటర్ల నుంచి ఆదరణ లభించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తమకు అందించిన సంక్షేమ పథకాలు గతంలో ఏ నాయకుడు అందించలేదని మహిళలు కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా జగనన్న అందించిన పాలన జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఇచ్చిన మాటకు కట్టుబడి నవరత్నాల పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మీకు మంచి జరిగితేనే నాకు ఓట్లు వేయండని ప్రజల ముందుకు వస్తున్నారని ఆశీర్వదించి ఎమ్మెల్యేగా మేకతోటి సుచరితను, ఎంపీగా కిలారి వెంకట రోశయ్యను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు ఆలోకం సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు నాయుడు నాగేశ్వరరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, డాక్టర్ అశోక్, నాయకులు కంతేటి ఫకీర్, గంజిమాల రమేష్, బెజ్జం రత్తయ్య, వేముల నాగేశ్వరరావు, నేలపాటి నాగేంద్ర, దాసరి సిలువేసు పాల్గొన్నారు.

సచివాలయాల సిబ్బందిపై టీడీపీ నాయకుల దౌర్జన్యం

- వచ్చేది మా ప్రభుత్వమేనని చెప్పింది చేయాల్సిందేనని బెదిరింపులు
- భయాందోళనలకు గురవుతున్న ఉద్యోగులు

తాడేపల్లిరూరల్ : టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కుమారుడు మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలవడంతో క్రింది స్థాయి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఉండవల్లిలో నివాసముండే ఓ టీడీపీ నాయకుడు ఖాళీస్థలంపై పన్ను వేయాలని సచివాలయ సిబ్బందిని కోరడంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ దరఖాస్తులో సరైన పత్రాలు లేకపోవడంతో రెవిన్యూ సిబ్బంది తిరస్కరించారు. వెంటనే అక్కడ ఉన్న సెక్రటరీ, ఇతర సిబ్బందిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. వచ్చేది మా ప్రభుత్వమేనని మేము చెప్పిన పనులు ఎందుకు చేయరో చూస్తాం అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. మరో 13 రోజుల తరువాత మీరు ఇక్కడ ఉండరు అంటూ హెచ్చరిక ధోరణిలో మాట్లాడారు. ఇదే ప్రాంతానికి చెందిన ఓ మాజీ ప్రజా ప్రతినిధి భర్త శానిటేషన్ సిబ్బందిని తన ఇంటికి పంపించలేదని సచివాలయానికి వచ్చి ఇదే రకంగా చిందులు తొక్కడంతో సిబ్బంది భయ భ్రాంతులకు గురయ్యారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లి సెంటర్, 1వ వార్డు, మహానాడు సచివాలయాల్లో ఇదే తరహాలో ఓ టీడీపీ కార్యకర్త సచివాలయ సిబ్బంది చేయలేని పనులను చేయమంటూ ఇబ్బందులకు గురిచేస్తూ వారిపై అసభ్యకరంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. టీడీపీకి చెందిన ఓ నాయకుడి తమ్ముడు కొండవాగును ఆక్రమించుకుంటున్నారని నేరుగా కమిషనర్‌కు ఒకరు ఫిర్యాదు చేశారు. అది పరిశీలించేందుకు వచ్చిన రెవిన్యూ సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడి అక్కడి నుంచి సదరు టీడీపీ నాయకుడు పంపించివేశాడు. ప్రతి వార్డులో ఓటరు స్లిప్పులు పంచేటప్పుడు వారు చెప్పినట్లు చేయకపోతే మేము అధికారంలోకి వచ్చాక మీ అంతు చూస్తామని బెదిరిస్తున్నారు. ఒక పక్క ఎన్నికల కమిషన్ అన్ని పార్టీలతో కలిసి బీఎల్‌వోలు స్లిప్‌లు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. దాని ప్రకారమే అధికారులు, కిందిస్థాయి సిబ్బంది నడుచుకుంటున్నారు. టీడీపీకి చెందిన బీఎల్‌వోలు కొంతమంది అసంతృప్తిగా ఉండి ఓటర్ స్లిప్‌లు పంచడానికి దూరంగా ఉండడంతో పార్టీకి చెందిన మరికొంత మందిని ఎన్నుకోవడంతో కింది స్థాయి సిబ్బంది, ఇతర పార్టీల వారు దానిని వ్యతిరేకిస్తున్నారు. బిఎల్‌వోలను సైతం తమ ఇష్టం వచ్చిన రీతిలో తిడుతూ మీ ఉద్యోగాలు ఉండవని బెదిరింపులకు పాల్పడుతున్నారు. జరిగిన ఈ సంఘటనలపై పలువురు సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

బెదిరింపులకు పాల్పడితే చర్యలు తప్పవు

ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందిపై ఏ పార్టీకి చెందిన వారైనా బెదిరింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. ఎన్నికల నియమావళిని అనుసరించి అన్ని పార్టీల నాయకులు వ్యవహరించాలని లేని పక్షంలో చర్యలకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు.

శ్రీశ్రీకి ఘన నివాళి

లక్ష్మీపురం: ఆధునిక ఆంధ్ర సాహిత్య సాహిత్యంలో అభ్యుదయ యుగానికి నాంది ప్రస్తావన చేసిన మహాకవి శ్రీశ్రీ కవిత్వంలో నూతన శకానికి ఆద్యుడని, సాహితీ జగత్తులో ఆయన రచనలు అజరామరంగా నిలిచిపోతాయని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మహాకవి శ్రీశ్రీ జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పెనుగొండ మాట్లాడుతూ ధనిక స్వామ్య దురాశా పిశాచానికి బలి అయి అల్లాడుతున్న పేదల వాణిని వినిపింపజేసిన విప్లవ కవి శ్రీశ్రీ అన్నారు. శ్రీ శ్రీ తెలుగులో వినూత్న కవితా ప్రయోగశీలిగా, అభ్యుదయ కవితా మార్గదర్శకుడిగా భావ కవితా యుగంలో, భాషలో,చందస్సులో కొత్త పోకడలను సృష్టించారన్నారు.

సంక్షేమ ప్రదాత జగనన్న ప్రభుత్వాన్ని పునర్నిర్మిద్దాం

- ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- వరగాని, విశదల, మందపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



వరగానిలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, సుచరిత



వృద్ధురాలిని ఆత్మీయ ఆలింగనం చేసుకుంటున్న సుచరిత

మేడికొండూరు: మేడికొండూరు మండల పరిధిలోని వరగాని, విశదల, మందపాడు గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మేకతోటి సుచరిత, వెంకట రోశయ్యలకు ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. విశదల గ్రామంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మందపాడు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు వంద ట్రాక్టర్లతో భారీ ర్యాలీ చేపట్టారు. 4 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వరగాని, మందపాడు, విశదల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు దేవాలయాల్లో ప్రార్థనల్లో పాల్గొన్నారు. గడప గడపకూ వెళ్లి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ దేశంలో ఏరాష్ట్రంలో లేని సామాజిక న్యాయం అమలు చేస్తున్న ఘనత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. నిరుపేదల జీవన ప్రమాణం పెంచడమే అసలైన అభివృద్ధి అని నమ్మి సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా, పెన్షన్లు ఇంటి వద్దకు రావాలన్నా జగన్నతోనే సాధ్యమన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కిలారి వెంకటరోశయ్యలను అత్యధికంగా మెజార్టీతో గెలిపించాలని సుచరిత ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో వరగాని గ్రామ సర్పంచ్ సానికొమ్ము యలమందారెడ్డి, మందపాడు సర్పంచ్ ఆవుల సంజీవరెడ్డి, విశదల వైస్ ప్రెసిడెంట్ ఖాశిం, మేడికొండూరు జెడ్పీటీసీ కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ రాజశేఖరరెడ్డి, సొసైటీ చైర్మన్ కోటిరెడ్డి, బోడపాటి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, ముత్యాల బాలస్వామి, గంటికోట రసూల్, ఎంపీటీసీ జీవనజ్యోతి, ఊర్దురాజు, శాంతయ్య, కొరివి చెన్నయ్య, సాంబిరెడ్డి, ఆవుల రంగారెడ్డి, దండా సూర్యనారాయణరెడ్డి, శాంతి శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, సుబ్బారెడ్డి, ఉడతా శ్రీనివాసరావు, ఊర్దు రాజు, పలువు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.2 లక్షలు స్వాధీనం

గుంటూరు ఈస్ట్: ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళుతున్న వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. విద్యానగర్ 1వలైనులో సూర్యదేవర కృష్ణ రూ.2 లక్షలు నగదుతో వెళుతున్నాడు. పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయంలో ఎలాంటి ఆధారం లేకుండా నగదు తీసుకెళుతున్నట్లు ధ్రువీకరించి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రీత్ ఎనలైజర్లు ఏర్పాటు చేయాలి

అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మద్యం తాగి వచ్చే వారిని గుర్తించేందుకు బ్రీత్ ఎన్‌లైజర్స్ ఏర్పాటు చేయాలని విపరీతమైన ఎండల కారాణంగా పోలింగ్ సమయాన్ని రాత్రి ఎనిమిది గంటల వరకూ పొడిగించాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్రాంత ఆర్టీసి విశ్రాంత అధికారి వి.ఎస్.ఎన్ మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఎక్కడా అమలు కావడం లేదని చాలా మంది తాగి ఓటు వేయటానికి వచ్చి ఆమత్తులో ఎవరికో వేస్తున్నారని అన్నారు.

బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల పరిశీలన



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి రాజకుమారి, ఎన్నికల పరిశీలకులు నీరజ్‌కుమార్

మంగళగిరి: మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 300 పోలింగ్ కేంద్రాలకు 1080 బ్యాలెట్ యూనిట్లు, 360 కంట్రోల్ యూనిట్లు, 388 వీవీ ప్యాట్స్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి కేటాయించడం జరిగిందని ఎన్నికల పరిశీలకులు నీరజ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారితో కలసి బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో ప్రతి పోలింగ్ కేంద్రానికి బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లతో పాటు వీవీ ప్యాట్స్‌ను కేటాయించడం జరిగిందన్నారు. పోటీలో పాల్గొంటున్న అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో రేండమైజ్ చేసి పోలింగ్ కేంద్రం వారీగా జాబితాలను ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులకు అందజేయడం జరిగిందన్నారు. మరోవైపు శుక్రవారం ఉదయం నుంచి హోమ్ ఓటింగ్ నిర్వహించేందుకు 15 బృందాలు తరలి వెళ్లనున్నట్లు తెలిపారు.

టెన్త్ ప్రతిభావంతులకు సన్మానం

గుంటూరు ఎడ్యుకేషన్: గత నెలలో విడుదలైన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో గుంటూరు నగరంలోని ప్రభుత్వ, నగరపాలక సంస్థ పాఠశాలల నుంచి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు గురువారం అవగాహన యోగా కేంద్ర ఆధ్వర్యంలో ఆర్టీసీ కాలనీలోని సన్మానించారు. ఈసందర్భంగా ఇబ్రాయిల్‌పేటలోని బొర్రా నాగేశ్వరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల నుంచి 582 మార్కులు సాధించిన విద్యార్థిని ఫాతిమా తబస్సుమ్‌తో పాటు అదే ప్రాంతంలోని సెయింట్ లారెల్స్ హైస్కూల్ నుంచి 588 మార్కులు సాధించిన మొహమ్మద్ గౌస్ నయీముద్దీన్‌ను శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రం అందజేశారు. నగరపాలక సంస్థ పాఠశాలల నుంచి 570కి పైగా మార్కులు సాధించిన మరి కొంత విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తు వైద్య విభాగానికి రూ.5 లక్షల వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి జింకాన చేస్తున్న సేవలను మరువలేమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. గురువారం జింకాన ప్రతినిధి డాక్టర్ త్రిపురనేని రవి ఆర్థిక సహకారంతో జింకాన కో ఆర్డినేటర్లు డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ బాల భాస్కర రావు రూ.5 లక్షల రూపాయల విలువ చేసే వైద్య పరికరాలను మత్తు వైద్య విభాగానికి సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మత్తు వైద్య విభాగంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ త్రిపురనేని రవి ఆర్థిక సహాయంతో వైద్య పరికరాలు ఏర్పాటు చేశామన్నారు.

మానసిక వైద్య విభాగంలో..

గుంటూరు మెడికల్: రోగులకు ఎలాంటి నొప్పి, బాధ లేకుండా మత్తు ఇచ్చి షాక్ ట్రీట్‌మెంట్ వైద్య సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌ను మానసిక విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమాజ్యోతి కోరారు. వైద్య విభాగంలో ఎప్పటి నుంచో షాక్ ట్రీట్‌మెంట్ చికిత్స కోసం ఆపరేషన్ థియేటర్ సౌకర్యం లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్న విషయాన్ని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. డాక్టర్ కిరణ్ కుమార్ వెంటనే దాతల సహకారంతో షాక్ ట్రీట్ మెంట్ కు అవసరమైన పరికరాలను, ఆపరేషన్ థియేటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.